# భర్తల దినోత్సవం

## ఎస్.వివేకానంద

గాఢ నిద్రలో వున్న సుబ్బారావ్‌కి చెవులు చిల్లులు పడేట్టు సుప్రభాతం వినిపించటంతో ఉలిక్కిపడి లేచి గోడగడియారంకేసి ఓ లుక్కిచ్చి 'వామ్మో! లేటయితే నా వీపు విమానం మోతే'నని భయపడుతూ మంచం దిగి బాత్‌రూమ్ వైపు పరుగుపెట్టాడు.

కాలకృత్యాలు తీర్చుకుని కిచన్లోకి జొరబడి 'స్టౌ' వెలిగించి పాలకుక్కర్ గ్యాస్ స్టౌమీద పెట్టాడు.

భార్యామణేమో డబుల్‌కాట్ బెడ్‌మీద సింగిల్‌గా పడుకుని టాప్ లేచిపోయేట్టు గురుకపెడుతూనే వుంది.

ఓసి దీని గురకనాశనంగానూ... పక్కింటివాళ్ళు సైతం హడలి చచ్చేట్టు వుందంటూ గొణుక్కున్నాడు.

ఒసేవ్! నువ్ పెట్టే గురకశబ్దానికి ఇంటి శ్లాబ్ తునాతునకలై మీదపడితే నువ్ చచ్చిపోతావ్!- హుఁ. దీనిది రాక్షస గురక! కుంభకర్ణుడు కూడా ఇంత భయంకరంగా గురకపెట్టి వుండడు.

మహిళామణి సడన్‌గా కళ్ళు తెరిచి పరిసరాలను ఓమారు పరికించి 'ఆకలి... ఆకలి...' అంటూ బకాసురుడిలా కేకలుపెడుతూ ''ఒరేయ్ మొగుడు చచ్చినోడా... బెడ్‌కాఫీ ఏదిరా? నువ్వేమో తెల్లవారక ముందే లేచి ఎంచక్కా హాట్‌హాట్‌గా హార్లిక్స్ తాగు తావా?'' పాచిముఖంతోనే మొగుడ్ని శాపనార్థాలు పెట్టింది.

''ఒసేవ్!... ఈరోజు భర్తల దినోత్సవమే!... ఈ ఒక్కరోజైనా తిట్టకే పవిత్రా...'' కాఫీగ్లాసుతో ప్రత్యక్షమై విన్నవించుకున్నాడు సుబ్బారావ్.

లోటాడు కాఫీ గుటుక్కున వకే వక్కగుక్కలో తాగి ''తిట్టకూడదా?... అయితే కొట్టచ్చన్నమాట...'' దగ్గరగా వున్న భర్తవీపు మీద రెండు పిడిగుద్దులు వడ్డించింది.

ఇది చాలదన్నట్టు... మహాకాయాన్ని మంచంమీది నుండి నేలమీద పడేసే ప్రయత్నంలో మొగుడి పాదం మీద పవిత్ర తన కాలు ఆన్చటంతో... ఆ బాధ భరించ లేకపోయిన సుబ్బారావ్ లబోదిబోమన్నాడు.

''పొద్దుటే నీ ఏడుపేంటి?'' కాలు వెనక్కు లాక్కుని మొగుడినెత్తిన మొట్టింది.

పవిత్ర వేసిన మొట్టికాయ దెబ్బకి నెత్తి బొప్పికట్టి బూరెలా ఉబ్బింది. బాధతోమనిషి విలవిల్లాడేడు.

''అట్లా గుడ్లుమిటకరించి చూస్తూ నిలబడక పోతే... నన్ను వాష్ బేసిన్ వరకూ చేయిపట్టుకు నడిపించచ్చుగా...?'' ఉరుము ఉరిమినట్టు అంది.

పవిత్ర హుంకరింపుకు సుబ్బారావ్ బిక్క చచ్చిపోయాడు.

'చేస్తానే హిడింబీ... చేస్తా!... నీకు సాయం చేయక చస్తానా!?... ఏ జన్మలో చేసుకున్న పాపఖర్మమో బుల్‌డ్రోజర్‌లాంటి నీకు భర్తనైనానా అవస్థలుపడుతున్నాను. నీకు సాయంచేసి నీ పళ్ళు తోముతాను... నీవంటి చుట్టు కొలతకి చేతులు అందక నీవు ఇబ్బంది పడుతూంటే... నీవీపూ సబ్బుతో రుద్ది స్నానం చేయిస్తాను... మనసులో తిట్టుకున్నాడు.

నా ముద్దుల భార్యకు బ్రేక్‌ఫాస్ట్ స్వయంగా తినిపిస్తాను... లంచ్ డిన్నర్‌అప్పుడు కూడా నీకు గోరు ముద్దలు తినిపిస్తాను... ఇంకా ఏంచేయమన్నా చేస్తాను.... కసి తీరక ఇంకా గొణుక్కుంటూనే వున్నాడు.

''ఇదిగో పవిత్రా!... ఈ ఒక్కరోజైనా నన్ను కష్టపెట్టకుండా నీ పన్లు నువ్ చేసుకో! నీకుపుణ్యముంటుంది. భర్తని ఈ జన్మలో గౌరవిస్తే... వచ్చే జన్మలో నీవు అందంగా... నాజుగ్గా... పుట్టి ప్రపంచసుందరి పోటీలో గెలుస్తావ్! క్రితం జన్మలో నువ్వే పాపం చేసుకున్నావో

ఇప్పుడు నా పాలిట పడ్డావ్! నరకయాతన అనుభవించ లేక ఛస్తున్నాననుకో...'' వినపడీ వినపడకుండా గొణిగాడు.

''నా చెవులు సెన్సిటివ్‌గానే వున్నాయ్. నాకు చెవుడు లేదు. నీ నంగనాచి మాటలకేంలే! తిక్కరేగిందంటే ఒక్క టిస్తాను. అనవసరంగా 'ఆర్గ్యు' చేశావనుకో 'రఫ్' ఆడిం చేస్తాను. పెళ్ళామంటే నీకు రాను రాను బొత్తిగా గౌరవం లేకుండా పోతోంది! బీకేర్‌ఫుల్!!'' కనుపాపలు పెద్దవి చేసి మొగుడి ముఖంలోకి ఉరిమి చూసింది.

''ఫుల్లేలే!... హాఫ్ ఏనాడేడ్చింది కనుక? రోజూ ఫుల్లే... అదే బీకేర్ ఫుల్లు(ల్)....'' చేయిపట్టుకుని వాష్‌బేసిన్ వరకు జాగ్రత్తగా పాదివిపట్టుకుని నడిపించి ఆపై బ్రష్ మీద 'పేస్ట్'వేసి కిచకిచమని శబ్దం వచ్చేలాబరబర శబ్దంతో పవిత్రకు దంతధావన కార్యక్రమాన్ని పూర్తి చేశాడు సుబ్బారావు.

తోమిన పళ్ళను పైనున్న మిర్రర్లో ఇకిలించి చూసు కుంటూ ''ఈరోజు ఆఫీసుకు సెలవు పారేయండి...'' హుకుం జారీ చేసింది.

''ఎందుకే? నీ ఊబకాయం తగ్గించేటందుకై మనిద్దరం ఏకంగా హెల్త్‌కేర్ సెంటర్‌కెళ్ళాలా?'' బేలగా అడిగాడు.

''నువ్ నోర్మూయ్! అధిక ప్రసంగం చేయకు! అలాంటి క్లినిక్స్‌కెడితే... ఉపవాసాలుండమంటారు... కడుపు నిండా కోరిందల్లా తినద్దంటూ సవాలక్ష ఆంక్షలు పెడతారు! హాయిగా... నేనిలాగే ఈ సైజులోనే వుంటాను. ఇట్లా వుండటమంటేనే నాకిష్టం...'' కిచకిచమని నవ్వుతూ

## రెప్పలవెనుక స్నేహం

**క**నురెప్పల వెనుక స్నేహాన్ని దాచి
గుండెలోతుల్లో ఆశలుపోసి
అప్పుడే ఈ లోకాన్ని చూసిన నా లేత శరీరంమీద
ఏవో ఆనందపు చినుకులు పడగానే
వెనక్కి తిరిగిచూస్తే ఎదురుగ నాన్న
అంతవరకు ఏమీకాని వ్యక్తి
అమ్మపక్కన నన్ను చూసేసరికి
ఏదో తెలియని ఆనందంతో నన్ను ముద్దుపెట్టి
నప్పుడు
ఆ చల్లని స్పర్శ
ఆ ఎత్తైన రూపం నాన్న
తొమ్మిది నెలల స్నేహానికి అమ్మ నాకు జన్మనిస్తే
ఒక్కరోజు పరిచయంలోనే నాన్న
జన్మంత నా బరువు బాధ్యతలు మోశాడు
నా సంతోషంలో దుఃఖంలో
నా ఊహల్లో జ్ఞాపకాల్లో
నా ఆలోచనల్లో అవసరాల్లో
నేనుపడే మానసిక సంఘర్షణలో
సేద తీర్చే స్నేహితుడిలా నావెన్నంటుండి
నాతోపాటుసగభాగాన్ని పంచుకున్న నాన్న
అమ్మపోయాక నా సుఖంకోసం
జీవితాంతం నా కంటి రెప్పయ్యాడు
నా బాల్యం నలిగిపోని పువ్వులా
నా యౌవ్వనం కరిగిపోని రేయిలా
నా జీవితం చుట్టు ముళ్ళకంచెలా కాపలాకాసి
తను కరుగుతూ వెలుగును పంచిన నాన్న
తను పోయే ముందు నా రాకకోసం
కళ్ళల్లో దీపాలు పెట్టుకుని ఎదురుచూస్తూ
నన్ను చూడగానే తనివితీర ఒళ్ళంత నిమిరి
తృప్తిగ కన్నుమూసిన నాన్న ఋణం
ఏమిచ్చి తీర్చుకోగలను
ఈ లోకంలో ఏదైనా బంధం ఉందంటే
అది అమ్మ నాన్న తరువాతే

చొక్కర తాతారవు (సితారా)

## నా తెలుగు లోగిలి...

నా తెలుగు భాషా స్వరూపం
మరపురాని మధుర పదకోశామృతం!
నా తెలుగు భాషా గమనం
ముగ్ధ మనోజ్ఞ మంజుల వాణీ ప్రణవం!
తేనెలొలుకు నా తెలుగు పలుకు
పద్మరాగ జంఝా మారుత పూబోణి!
సొగసు భావాల మరకత మాగాణి!!
నా తెలుగు దివ్యలోగిలి
ఆధ్యాత్మిక అమృత లిపికి ఆనవాలు!
నా తెలుగు ప్రాంగణం
మహోన్నత భావ అక్షర తూణీరం
కర్మ పరిపాల రసపూర్ణోదయం!
కవిత్రయ తొలి పద్యభారత వాఙ్మయం
నా జ్ఞాన చక్షువుల భూపాలరాగం!
'దేశ భాషలందు తెలుగు లెస్స...?'
అన్న-శ్రీకృష్ణదేవరాయల పసిడివాక్కు
తెలుగు భాషా కంఠసీమలో మణిహారమై
ధగద్ధగాయమానమై శోభిల్లుతోంది!
అష్టదిగ్గజాల సారస్వత నిలయానికి
కాంతి పుంజమై వెలుగులు విరజిమ్మింది!
వేనవేల రారాజుల జేజేలందుకొన్న
శిఖర సంచారదర్శన జయకేతనం నా
తెలుగుదనం!
ఎందరో ఘనాపాటీల... మరెందరో
మహానుభావుల
సర్వకళల సర్వోత్కృష్ట సుస్థిరస్థానానికి
కాణాచి!
ఎదలో పెల్లుబికే నవరస భావ చిత్రాలకు
అపురూపాక్షర సాక్ష్యాల గవాక్షం నా
తెలుగుతనం!
తెలుగంటే భాషేకాదు
ప్రపంచమంతా పాకుతున్న తేనె సోన!
నేల నాలుగు చెరగులను దీప్తివంతం చేస్తోన్న
నా తెలుగు తేజస్సు
ఉర్వీ ఉనికికే ఉషస్సు!
అందుకే... మళ్ళీ జన్మలో
తెలుగు భాష నుడికారమై జన్మిస్తాను!
తెలుగు లోగిలికి తోరణమై శ్వాసిస్తాను!!

**వంగర పరమేశ్వరరావు**

తన రూపాన్ని మరోసారి అద్దంలో వీక్షించుకుంది.

"నేను సెలవెందుకు పెట్టాలో సెలవీయనే లేదు..." తాహసీల్దార్ వెంట చేతులుకట్టుకు నిలడే బిళ్ళ బంట్రోతు పోజులో అతి వినయంగా ప్రశ్నించాడు.

"ఈపూట ఒక్కవంటే కాదు... స్పెషల్ అయిటమ్స్ హాట్ స్వీటూ కూడా నువ్వే చేయాలి. ఈరోజు భర్తల దినోత్సవం కదా...? మనిద్దరం షడ్రసోపేతంగా విందారగించద్దూ...?" దీర్ఘాలు తీస్తూ చెప్పింది.

పండగరోజున కూడా పాత మొగుడేనా అనే ముతకసామెత గుర్తుకొచ్చింది సుబ్బారావ్‌కి. ఈరోజైనా వంటపని తప్పించుకుని హాయిగా ఏ ఐదునక్షత్రాల హోటల్లోనైనా భోజనం తృప్తిగా చేయచ్చుకదా అనుకున్న సుబ్బారావ్ ఆలోచన్లకు 'బ్రేక్' వేసింది పవిత్ర. వంటే కాకుండా స్పెషల్ అయిటమ్స్ కూడా చేయాలని ఆర్డర్ వేయటంతో సుబ్బారావు బిక్కచచ్చిపోయాడు.

ఈరోజు వంటపని చేయకుండా ఎస్కేప్ అవుదామన్న తన ఆలోచనకి బ్రేక్ వేయటంతో పవిత్రను తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టిపోసాడు మనసులో.

ఈ గృహహింస నుండితనకు విముక్తి లభించే దెప్పుడో?- ఇక తనువు చాలించాక నే! అంతవరకు తనకు కష్టాలు తప్పవ్. కొందరి బతుకులింతే! అనుకున్నాడు.

భార్యకు భర్తపట్ల జాలి దయ రవంతైనా వుండక

పోవటం అంటే ఇదే కాబోలు అనిపించింది.

భర్త భార్యని చెండుకు తినటం... రాచి రంపాన పెట్టడం సహజం! కానీ తనింట్లో రివర్స్!!

గయ్యాళి శాడిస్ట్ పెళ్ళాంతో వేగటందుర్భరంగా వున్న దన్పిస్తోంది. తనను తాను తిట్టుకున్నాడు.

పోనీ... ఏ పోలీస్‌స్టేషన్‌కైనా వెళ్ళి భార్య తనను అను క్షణం హింసిస్తోందని ఫిర్యాదు చేస్తే? అమ్మో! ఇంకేమైనా వుందా? నన్ను బతకనిస్తుందా? చీల్చి చెండాడేస్తుంది. తనతో ఫుట్‌బాల్ ఆడుకుంటుంది.

ఇంతకూ ఆఫీసుకు వెళ్ళటమా... భార్య ఆజ్ఞాను సారం సెలవుపెట్టడమా?... ఎటూ తోచక బుర్రగోక్కు న్నాడు.

భర్తల దినోత్సవం నాడైనా తలంటుకుని... వంటికి నలుగుపెట్టుకుని... షాంపూ స్నానం ఆచరించి ఇంపో ర్టెడ్ పెర్‌ఫ్యూమ్ వంటిన 'స్ప్రే' చేసుకుని కొత్త బట్టలేసు కుని జల్సాగా ఖుషీగా ఆఫీసుకెళ్ళాలనే తన ఉత్సాహం మీద నీళ్ళు చల్లిన పవిత్రమీద పీకలదాకా కోపమొచ్చినా... ఏమీ చేయలేని నిస్సహాయస్థితి తనది.

తాను దుర్బలుడు! బలహీనుడు! పిరికి సన్నాసి!! చవటాయ్ తాను!... ఇంకా ఎన్నో రకాలుగా తనను తాను నిందించుకున్నాడు పుట్టెడు నిరుత్సాహంతో కొట్టు మిట్టాడుతూ.

''అట్లా ఏడుపు మొహం పెడతారేం?- ఈరోజు మీ దినోత్సవం కదా?... హుషారుగా వుండాలి...'' డబుల్ సోఫాలో కూర్చు న్యూస్ పేపర్ తిరగేస్తూ అంది పక్కనే వున్న సుబ్బారావుతో.

తన బతుక్కి సంతోషం... నవ్వు కూడానా?! ఏడుపొక్కటే తక్కువ!

అయినా పవిత్ర ఆనతి మీరలేక ఆర్టిఫిషియల్‌గా నవ్వేడు సుబ్బారావు. తన నవ్వు తనకే అసహ్యంగా వున్నదన్పించింది.

''నీమర్మరింగేమిటి? మనసులో గొణుక్కోకు. ఏదైనా అనాలనుకుంటే నిర్భయంగా పెద్దగా ధైర్యంగా ఈ ఒక్కరోజైనా మాట్లాడు! అవునూ.. నీకు జాంగ్రీ చేయటం వచ్చు కదూ?- స్వీటు అది చేసెయ్. మరి... హాట్ ఏంచేస్తావ్?... ఆఁ!... మిర్చి బజ్జీ చేసి ఉల్లి సన్నగా తరిగి... దాంట్లో కూరి... నిమ్మరసం పిండు... అబ్బ! తింటూంటే భలే మజాగా వుంటుంది.

ఎప్పుడూ తిండియావే! అందుకే బుల్‌డోజర్లా తయారయ్యావ్! అయినా డయటింగ్ చేసి చావవు... ''ఒసేవ్! ఇంకా ఊరిపోయావంటే... నిన్ను తీసుకెళ్ళి ఏ ఆస్పత్రిలోనో... ఆశ్రమంలోనో పారేస్తాను. పీడా వదుల్తుంది'' అంటూ చప్పుడుకాకుండా పళ్ళునూరాడు సుబ్బారావ్.

''ఏమిటలా దరిద్రపుగొట్టు మొహంపెట్టి... దివాళా ఎత్తిన వాడిలా పోజు నువ్వూను! చూడూ... భోజనం చేశాక ఇద్దరం చెట్టాపట్టాలేసుకుని హాయిగా అలాబైటి కెళ్ళి తిరిగొద్దాం... ఏం?'' మనసులో మాట బైటపెట్టింది పవిత్ర.

'క్రిష్ణ... క్రిష్ణ!... నిన్ను వెంటపెట్టుకుని షికారుకా? ఇంకా నయం పిక్చర్‌కెళదాం అన్నావు కాదు. హాల్లో సీటు నీకెట్లాగూ సరిపోదు కదా?... అందుకే వద్దనుకుని వుంటావే రాక్షసి...'

''మీలో మీరు ఉడుక్కోకండి! నాకు మైండ్ రీడింగ్ కూడా వచ్చు! మనసులో మీరేమనుకుంటున్నారో గ్రహించగలను...! పోజు కొట్టింది పవిత్ర.

''ఇదే నీతో వచ్చిన తంటా! అందుకే నువ్వంటే వళ్ళు మంట!...''

''ఇక నోరు కట్టేయండి! లక్షల కట్నంపోసి మా డాడీ మిమ్మల్ని నాకు కొనిపెట్టాడు. మీరిలాంటివారని తెలిస్తే... ఏ షారూక్‌ఖాన్‌నో మేరేజ్ చేసుకుని వుండేదాన్ని...''

''ఇదిగో నన్ను మరీ కూరలో కరివేపాకులాగా తీసిపారేయకు! పెళ్ళినాటికి మనిద్దరం మేడ్‌ఫర్ ఈచదర్‌లాగే వున్నాం! ఆ తర్వాతే కంగుతిన్నాం! నువ్ పిప్పళ్ళ బస్తావైనావ్... నేనేమో పూచికపుల్లలా ఇలాగే వుండిపోయాను. మనిద్దరం బైటికెడితే జనం మనవెంటపడతారు సర్కస్‌లో జంతువువేమోనని! అంచేత వంటైతే నీవు కోరింది చేసిపెడతా! మింగు!! నావెంట బైటికి షికార్లు... సినిమాలు... అని మాత్రం అడక్కు!'' నిక్కచ్చిగా మాట్లాడేడు సుబ్బారావు ధైర్యాన్ని కూడగట్టుకుని.

''నువ్విట్లా మాట్లాడితేనే వళ్ళు మండుద్ది...!''

''అహఁ! నీకు మండనిదెప్పుడూ అంట? నన్ను చూస్తేనే నీకు వళ్ళు మంటాయే!?'' బిక్కముఖం వేసి బర్రన చీదాడు.

''ఏడవద్దు. నువ్వేడిస్తే నాకు చెడ్డ చిరాకు...''

''హేరామా! హేల క్ష్మణా!... నాకీ జన్మవద్దు... నన్ను తీసుకుపో... నేనీ సంసార జలధిని ఈదలేను...'' వల వలా ఏడుస్తూ నేలమీదపడి దొర్లిగింతలుపెట్టాడు చిన్న పిల్లాడిలా సుబ్బారావ్.

కాస్సేపటికి తెప్పరిల్లుకుని... బిత్తరిచూపులు చూస్తూ... వెర్రిమాలోకంలాగా అభినయించటం ప్రారం

భించాడు. ఈవిధంగా 'యాక్ట్' చేస్తేనన్నా... భర్తల దినోత్సవంనాడు వంటపని ఇంటిపనీ తప్పుతుందేమోనని!

''ఈమాత్రం దానికే పీకతెగిన కోడిలా గిలగిలా కొట్టుకోకండి!...'' సుబ్బారావ్ మనసుగాయాన్ని మాటలతో కెలికి మరింత పుండు చేయబోయింది పవిత్ర.

''చూడు నా అందాల మొగుడా!... భర్తల దినోత్సవమైనా... సింగినాదం దినోత్సవమైనా... ఐ డోన్ట్ కేర్! కిచన్లో దూరి వంట మొదలెట్టు...'' ఆర్డర్ జారీ చేసింది నిర్దయగ.

సమస్త దేవుళ్ళనీ తిట్టిపోస్తూ... సరాసరి దొడ్లోకెళ్ళి గంపకిందున్న కోడిపెట్టని బైటికి లాగి దాని పీకతెగ్గోసి దాని ఈకలుపీకి డ్రెస్సింగ్ చేసి ముక్కలుగా కోసి బిర్యానీ వండే ప్రయత్నంలో మునిగిపోయాడు.

ఏలిన్నాటి శని ఎప్పుడు విరగడవుతుందో?... తాను కష్టాలనుండి ఎప్పుడు గట్టెక్కేరోజు వస్తుందో?... కనీసం ఈరోజైనా తను సుఖపడనిచ్చిచావనందుకు సుబ్బారావు అంతరాత్మ కుళ్ళిపోతోంది.

అసలు... ఆడదానికి మొగుడయ్యేకంటే... అడవిలో మానై పుట్టడం నయం అనే డైలాగ్ రివర్స్‌లో చెప్పుకున్నాడు.

జన్మజన్మలకీ ఈ మగబతుకొద్దు!... కన్నీరు కార్చకుండా... ఎక్కిళ్ళిపెట్టకుండా సైలెంట్‌గా దుఃఖించాడు సుబ్బారావ్ వంట చేస్తూ.

కమ్మగా వండిపెట్టిన చికెన్ బిర్యానీ మెక్కి మొగుడ్ని మెచ్చుకుంది పవిత్ర.

''నువ్వు వంటపనిలో నిమగ్నమైవుండగా... ఇందాక ఫోన్ మెసేజి వస్తేను... మాట్లాడాను!... ఓరి నా మొగుడో... హార్టీ కంగ్రాట్స్...'' అనేసి అభినందించింది.

ఎందుకు కంగ్రాట్స్ చెప్పి తనను అభినందించిందో బోధపడక షేక్స్‌పియర్ మొహంపెట్టాడు సుబ్బారావ్.

''అవునుమరి... విషయం నీకు చెప్పలేదు కదూ!?''

కమ్మగా బిర్యానీ స్వీటుహాటు చేసిపెట్టినందుకేమో అనుకున్నాడు. అంతలోనే తేరుకుని... అయోమయం నుండి తెప్పరిల్లి పవిత్ర ముఖంలోకి ఏంచెప్పనున్నదోని ఆశగా చూశాడు.

''ఈ సంవత్సరం భర్తలదినోత్సం నాడు జంటనగరాలలో నివసించే జంటలలో ఉత్తమ భర్త ఎవరో ఎంపికచేసి సత్కరిస్తారనే విషయం పేపర్‌లో చూసి పోటీ నిర్వహించే సంస్థవారు అడిగిన వివరాలతో మీకు తెలీకుండా అప్లికేషన్ పెట్టాను. వారడిన ప్రశ్నలన్నింటికీ మీలో గల క్వాలిటీస్ సూటయినయ్! మీరే ఈ ఏటి మేటి ఉత్తమ భర్తగా ఎన్నికైనట్టు సాయంత్రం ఆరుగంటలకు ఫంక్షన్‌కి హాజరుకమ్మనీ... ఫోన్ చేశారు. నిజంగా మీరెంత అదృష్టవంతులండీ?!... నాకెంతో ఆనందంగా వుంది మీకే అవార్డు రావడం!... మోడల్ భర్తగా మీరు సత్కారానంతరం ప్రేక్షకులకు హితబోధ చేస్తూ ఉపన్యసించవచ్చు!''

ఆ మాటలు విన్న సుబ్బారావ్ అవాక్కయ్యాడు. మతిపోయినట్టనిపించింది.

''ఉత్తమ భర్తగా అవార్డా?... అందునా భర్తల దినోత్సవంనాడా?... నాకు బహుమతి రావటమా? హత విధీ!... నా బతుకు పబ్లిక్ అయిపోయింది. ఈ అవమానం భరించలేను. ఆత్మహత్యే నాకు శరణ్యం'' అనేసి గుండెలు బాదుకున్నాడు సుబ్బారావ్. ■

## కొత్తగా...

అనుకరణే నేడు
ఎక్కువవుతోంది
నలుగురు నడచిన
దారిలోనే నడుస్తారు కాని,
కొత్తదారులు వెతకరు
కొత్తగా బతకరు
కాస్త విభిన్నంగా
ఉండాలనే ఆలోచన
అస్సలు లేదు
వాడిలా నేనుండాలి
అనే ధ్యాస తప్ప
నేను, నేనులా ఉండాలి
అనే ధ్యాస మాత్రం లేదు
అయితే ఒక్కటి మాత్రం నిజం
ఎవరైతే సమాజంలో
విలక్షణంగా ఉండాలనుకుంటారో
వాళ్ళే గొప్పవాళ్ళు అవుతారు ఏనాటికైనా

ఆత్రం శశికిరణ్